# నవతరం
తెలుగు దినపత్రిక
RNI NO. APTEL/2014/58326

సంపుటి : -13 సంచిక : 152 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి
శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి
17-04-2026 శుక్రవారం వెల : 1/- పేజీలు : 4




## ఆధునిక సాంకేతికతతోనే రైతులకు వెలుగులు

- వ్యవసాయంలో నవీన పద్ధతులు అవలంబించాలి
- పరిశోధన సలహా మండలి సమావేశంలో జడ్పీ సీఈఓ వెంకటరమణ
- విలువ జోడింపుతో రైతులకు అధిక లాభాలపై చర్చ

2లో

## పాలిసెట్-2026కు సర్వం సిద్ధం

### పకడ్బందీ ఏర్పాట్లకు కలెక్టర్ ఆదేశం



**నవతరం -శ్రీకాకుళం**

జిల్లాలో ఏప్రిల్ 25వ తేదీన నిర్వహించనున్న పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష (పాలిసెట్-2026) కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా మొత్తం 11,855 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరవుతున్నారని తెలిపారు. పరీక్షల సజావుగా నిర్వహణకు శ్రీకాకుళం, టెక్కలి, పలాస ప్రాంతాలను మూడు ప్రధాన సమన్వయ కేంద్రాలుగా గుర్తించి, మొత్తం 42 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు, రవాణా, వైద్య సదుపాయాలు కల్పించాలని పోలీసు, ఆరోగ్య, విద్యుత్ శాఖల అధికారులకు కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

ఈ పరీక్షా ప్రక్రియను పర్యవేక్షించేందుకు జిల్లా కోఆర్డినేటర్‌గా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. నారాయణరావు వ్యవహరిస్తున్నారు. శ్రీకాకుళం సమన్వయ కేంద్రం పరిధిలోని 25 కేంద్రాల్లో 6,859 మంది, టెక్కలి పరిధిలోని 8 కేంద్రాల్లో 2,555 మంది, మరియు పలాస పరిధిలోని 9 కేంద్రాల్లో 2,441 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు.

టెక్కలి కేంద్రానికి సిహెచ్. వి. నరసింహం, పలాస కేంద్రానికి డా. కె. యమున కోఆర్డినేటర్లుగా బాధ్యతలు నిర్వర్తిస్తారని అధికారులు వివరించారు. పరీక్షా కేంద్రాల వద్ద గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, అభ్యర్థులు సకాలంలో చేరుకునేలా ఆర్టీసీ బస్సులను నడపాలని ఈ సందర్భంగా నిర్ణయించారు.

## స్వీయ గణనను నమోదు చేసుకున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**నవతరం -శ్రీకాకుళం**

జనగణన-2027లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్వీయ గణన' ప్రక్రియను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రారంభించారు. గురువారం శ్రీకాకుళం జిల్లాలోని నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో https://se.census.gov.in పోర్టల్ ద్వారా ఆయన తన వివరాలను స్వయంగా నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశాభివృద్ధికి దిక్సూచిగా నిలిచే జనగణన ప్రక్రియలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. టెక్నాలజీని ఉపయోగించుకుంటూ ఇంటి నుండే సులభంగా వివరాలు నమోదు చేసుకునే ఈ వెసులుబాటును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జిల్లా వ్యాప్తంగా ఈ నెల 16 నుండి 30 వరకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రచార ప్రణాళికలో భాగంగా తొలిరోజైన నేడు మంత్రులు, ఎంపీలు, ప్రజా ప్రతినిధులు తమ వివరాలను నమోదు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రజలకు ఈ ప్రక్రియపై అవగాహన కల్పించి, స్వీయ గణనను ఒక ఉద్యమంలా ముందుకు తీసుకెళ్తామని ఈ సందర్భంగా సెన్సస్ అధికారులు వెల్లడించారు.

## రీ-సర్వే సమస్యల పరిష్కారమే ధ్యేయం

- రైతులకు తప్పులులేని పాసు పుస్తకాలు అందిస్తాం
- అక్కురాడలో రీ-సర్వే పనులపై కలెక్టర్ సమీక్ష
- జాప్యం లేకుండా ఖాతాల సవరణకు ఆదేశాలు

3లో



## పలాసలో మిన్నంటిన టీడీపీ సంబరాలు

### నారా లోకేష్ నియామకంపై హర్షాతిరేకం

2లో



## ఉమాకవికి రవీంద్ర భారతిలో కందుకూరి పురస్కారం



**నవతరం-శ్రీకాకుళం**

సాహితీ చైతన్యకిరాణాలు, బాలకథనిలయం వ్యవస్తా పక అధ్యక్షులు,శ్రీ శ్రీ కళావేదిక శ్రీకాకుళం జిల్లా కన్వీనర్ భోగెల ఉమామహేశ్వరరావు. కి కందుకూరి వీరేశలింగంపంతులు జయంతి సందర్భంగా హైదరాబాద్ రవీంద్ర భారతి లో ఉమాకవి సాహిత్య సేవలకు గుర్తింపుగా కందుకూరి పురష్కారం అందజేశారు. ఈ పురష్కారం జాతీయ తెలుగు సారస్వత పరిషత్,, తెలుగు భాషా చైతన్య సమితి, సర్వేజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పుర ష్కరాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ తెలుగు సారస్వత పరిషత్ కార్యనిర్వాహక అధ్యక్షులు కేశిరాజు రాంప్రసాద్, తెలుగు భాష చైతన్య సమితి అధ్యక్షులు

-మిగతా 3లో

## భార్య హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు



- నాటు తుపాకితో కాల్చి హత్య చేసిన భర్తకు శిక్ష
- 6వ అదనపు జిల్లా కోర్టు తీర్పు
- దర్యాప్తు అధికారులను అభినందించిన ఎస్పీ

2లో

## చిన్నారి చికిత్సకు రూ.10 వేల ఆర్థిక సాయం

- సిక్కోలు ఉద్దానం సేవా సమితి చొరవ - దాతలు ముందుకు రావాలని విజ్ఞప్తి
- వెన్నుపూస సమస్యతో బాధపడుతున్న దీక్షితకు సహాయం

3లో



ఎడిటోరియల్

# చర్చలను విఫలం చేసి...!

యుద్ధోన్మాది అమెరికా రంకెలు వేస్తున్నది. మరోసారి ఇరాన్ మీద విరుచుకుపడేందుకు, యావత్ ప్రపంచాన్ని ఇబ్బందుల పాల్జేసేందుకు పూనుకుంది. ఏ క్షణంలో అయినా దాడులు, ప్రతిదాడులు మొదలయ్యే పరిస్థితి కనిపిస్తోంది. శనివారం నాడు ఇస్లామాబాద్‌లో జరిగిన శాంతి చర్చలను ట్రంప్ యంత్రాంగం ఒక ప్రహసనంగా మార్చి వైఫల్య నెపాన్ని ఇరాన్‌పై నెట్టింది. ఒకవేళ మరోసారి ఇరాన్ చర్చలకు వచ్చినా తాను ఖాతరు చేయబోనని ఆదివారం రాత్రి ప్రకటించిన ట్రంప్ తన అసలు రూపాన్ని మరోమారు బయటపెట్టుకున్నాడు. చర్చలకు ముందే తమ యుద్ధ నౌకల్లో మారణాయుధాలను నింపుతున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. రెండువారాల పాటు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ప్రకటించినప్పటికీ తన తొత్తు ఇజ్రాయిల్‌తో లెబనాన్‌పై దాడులను కొనసాగించింది. చర్చలను విఫలం చేసేందుకే ఇలా చేసింది. కాల్పుల విరమణ ఒప్పంద గడువు ఈ నెల 22వ తేదీ వరకు ఉన్నప్ప టికీ మనదేశ కాలమానం ప్రకారం సోమవారం రాత్రి ఏడున్నర (ఇరాన్‌లో 5.30) తరువాత హార్ముజ్ జలసంధి దిగ్బంధనం కోసం మిలిటరీని నడిపేం దుకు పూనుకున్నట్లు అమెరికా మిలిటరీ సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. రండి ఎలా చేస్తారో చూస్తామంటూ ఇరాన్ స్పందించింది. తమ రేవుల భద్రతకు విఘాతం కలిగిస్తే పర్షియన్ లేదా ఒమన్ గల్ఫ్‌లో ఉన్న ఇతర దేశాల రేవులను వేటినీ వదలబోమని ప్రకటించింది.

దాడుల గురించి ట్రంప్ ప్రకటన ప్రభావం చమురు మార్కెట్‌పై పడింది. ఇది రాసిన సమయానికి బ్రెంట్ రకం 103డాలర్లకు పెరిగింది. దాడులు, ప్రతిదాడులు కొనసాగితే 150 డాలర్ల వరకు పెరగవచ్చనే ఆందోళన వెల్లడైంది. అమెరికా చర్యను తాము సమర్ధించటం లేదని బ్రిటన్,ఆస్ట్రేలియా ప్రకటించి మరోసారి గాలితీశాయి.

శాంతికోసం ప్రయత్నించాలన్న పోప్ లియో 14పై కూడా ట్రంప్ విరుచుకుపడటం కండకావరాన్ని వెల్లడించింది. యుద్ధం వద్దంటూ ఒక సాధారణ ప్రకటన చేశాను తప్ప ఎవరినీ పేరుపెట్టి చెప్పలేదని, అయినా అనుకున్నదాన్ని నిర్భయంగా చెబుతానంటూ స్పందించిన పోప్ రిపబ్లికన్ పార్టీ యంత్రాంగం బెదిరింపులకు లొంగేది లేదన్న సంకేతమిచ్చారని చెప్పాలి. ట్రంప్‌కు తన సందేశం అర్థం కాలేదని, ట్రంప్ కంపునోట్లో నోరు పెట్టేందుకు తాను సిద్ధం కాదన్నట్లుగా ఎవరితో నూ వాగ్వాదానికి దిగదలుచుకొనేది లేదని కూడా పోప్ చెప్పటం హుందాతనాన్ని వెల్లడించింది. ట్రంప్ ఉన్మాదం చివరికి తనను తాను ఏసుక్రీస్తు మాదిరి పరిగణించుకొని గాయపడిన ఒక సైనికుడిని పరామర్శిస్తున్నట్లుగా కృత్రిమమేధతో తయారు చేసిన చిత్రాన్ని స్వయంగా సామాజిక మాధ్యమంలో పోస్టు చేశాడు.తమ నేతలు దైవాంశ సంభూతులంటూ ఎవరైనా వీర భక్తులు వీదుల్లో వీరంగం, వంది మాగధులు స్తోత్రపాఠాలు వల్లించి ఉంటారేమో గానీ ఇలాంటి చౌకబారు పనులు బహుశా ఏ అమెరికా లేదా ఇతర దేశాధినేతలెవరూ చేసి ఉండరు.

నిజానికి హార్ముజ్ జలసంధిని ఇరాన్ పూర్తిగా మూసివేయలేదు. తన మిత్రదేశాల నౌకల రవాణాను అనుమతిస్తున్నది, శత్రుదేశాల వాటి మీద ఆంక్షలు విధించింది. ఫలితంగా రోజుకు 150 నౌకలు తిరిగేవి మార్చినెల మొత్తంలో అంతే సంఖ్యలో రాకపోకలు సాగించాయి. ఆ జలసంధిలో ఇరాన్‌కు కప్పం గట్టి రాకపోకలు సాగిస్తున్న ఓడలను కూడా అడ్డుకుంటామని ప్రకటించిన ట్రంప్ కొద్ది రోజుల క్రితం తాము కూడా టెహరాన్‌తో కలసి పన్ను వసూలు చేస్తామని చెప్పిన మాటలను మరచిపోరాదు. ఇరాన్ ఆంక్షలను విమర్శించిన అమెరికా తానే రంగంలోకి దిగి ఏ ఓడనూ ఇరాన్ రేవుల్లోకి రాకపోకలకు అనుమతించేది లేదని ప్రకటించింది. ఇరాన్ నుంచి కొనుగోలు చేసిన చమురుతో ఉన్న ఓడలను ఇప్పుడు ట్రంప్ జిగినీ దోస్తు మన ప్రధాని నరేంద్రమోడీ ఎలా జలసంధిని దాటిస్తారో చూడాల్సి ఉంది. దీనికీ "అనుమతి"ని అడుక్కుంటారా లేక ఇప్పటికైనా చేస్తున్నది తప్పని ఖండించి ఆత్మగౌరవాన్ని నిలుపుకుంటారా !

ఇంతకాలం సదరు జలసంధితో తమకు పనిలేదని, ఎవరికి కావాలంటే వారు మాట్లాడుకొని నౌకలను విడిపించు కోవచ్చు, మా దగ్గర చమురు చాలా ఉంది, కావాలంటే అమ్ముతామని మాట్లాడిన ట్రంప్ ఇప్పుడు దిగ్బంధనానికి ఆకస్మికంగా ఎందుకు నిర్ణయించాడన్న చర్చ జరుగుతోంది. ఇరాన్ ఎగుమతి చేసే చమురులో ఎనభై శాతం వరకు చైనా దిగుమతి చేసుకుంటున్నది. అందువలన ఒకే దెబ్బకు రెండు పిట్టలు అన్నట్లుగా ఇరాన్ రేవుల నుంచి ఆ ఓడలను అడ్డుకుంటే అటు చైనాను ఇటు ఇరాన్‌ను ఇరకాటంలో పెట్టవచ్చన్న ఎత్తుగడ స్పష్టంగా కనిపిస్తున్నది. బహుశా దానికి పూర్వరంగాన్ని సిద్ధం చేసేందుకే ఇరాన్‌కు చైనా ఇలాంటి చౌకబారు ఎత్తుగడలు గతంలో కూడా చైనా ముందు ప్రదర్శించిన అమెరికాకు తలబొప్పి కట్టి దిగివచ్చిన సంగతి తెలిసిందే. అమెరికా ఉడుత ఊపులకు బెదిరేవారెవరూ లేరని, ప్రపంచం మీద తన పెత్తనం చెల్లదని వాషింగ్టన్ పెద్దలు ఎంత త్వరగా గ్రహిస్తే అంతమంచిది!

# రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా అర్చనకు శుభాకాంక్షలు

- అర్చన నియామకంపై కత్తిరి వెంకటరమణ అభినందనలు
- పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్రకు గుర్తింపు
- యువతలో ఉత్సాహం నింపిన నాయకురాలిగా పేరు
- భవిష్యత్తులో ప్రజాప్రతినిధిగా ఎదగాలని ఆకాంక్ష

**నవతరం ప్రతినిధి శ్రీకాకుళం**



నరసన్నపేట, ఏప్రిల్ 10: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమితులైన బగ్గు అర్చనకు సారవకోట మండల టీడీపీ అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ ఆదేశాల మేరకు కార్యక్రమాలను విజయవంతం చేయడంలో అర్చన చురుకైన పాత్ర పోషించారని కొనియాడారు.2014 నుండి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తనదైన శైలిలో ప్రచారం చేస్తూ, యువతలో నూతన ఉత్సాహం నింపుతూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని అన్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన బగ్గు రమణమూర్తి-- సుగుణమ్మ దంపతుల దీవెనలతో పాటు పార్టీ నేతల ఆశీస్సులు అర్చన ఎదుగుదలకు దోహదపడ్డాయని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వంటి నాయకుల మార్గదర్శకత్వంలో పార్టీ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని తెలిపారు.భవిష్యత్తులో కూడా ఇదే తీరులో ప్రజాసేవలో ముందుకు సాగుతూ ప్రజల మన్ననలు పొందాలని, ప్రజాప్రతినిధిగా ఎదిగి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయాలని ఆకాంక్షించారు.

# గాయత్రిలో మెరిట్ స్కాలర్షిప్ టెస్ట్

**నవతరం-శ్రీకాకుళం**



నియోజకవర్గ మండల, మునసబుపేటలోని గాయత్రి కాలేజీ అఫ్ సైన్స్ అండ్ మేనేజ్మెంట్ కళాశాలలో, డిగ్రీ ప్రవేశం పొందే విద్యార్థులకు 2026-27 విద్యా సంవత్సరం నుంచి మెరిట్ స్కాలర్ షిప్ ఇవ్వనున్నట్టు గురజాడ విద్యాసంస్థల అధినేత జి.వి.స్వామినాయుడు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఒక ప్రకటనలో మాట్లాడుతూ మే 1 నుంచి 31 వరకు, ప్రతీ సోమవారం ఉదయం పది గంటల నుంచి, పన్నెండు గంటల వరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందని, ప్రతి వందమందిలో ఉత్తమ మార్కులు పొందిన ఐదుగురికి రూ.25 వేలు ప్రతిభా పురస్కారం అందజేస్తామన్నారు. పరీక్ష అర్థమెటిక్, రీజనింగ్, జనరల్ ఇంగ్లీష్, జనరల్ స్టడీస్ వంటి అంశాలపై ఉంటుందన్నారు. పరీక్షకోసం ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. మరిన్ని వివరాలకు కన్వీనర్ సిహెచ్ రాజ్ కుమార్, ఫోన్ నంబర్ 9440395109ను సంప్రదించాలని తెలిపారు. సమావేశంలో కరస్పాండెంట్ రంగారావు, సంచాలకులు సంయుక్త, కళాశాల ప్రిన్సిపాల్ కె.వి.వి.సత్యన్నారాయణ, ఐ. క్యూఎసి డాక్టర్. మార్తాండ కృష్ణ, మేనేజర్ వంగా మహేష్ పాల్గొన్నారు.

# 35 ఏళ్ల దేశ సేవకుడు ఇప్పిలి గ్రామంలో ఘన సన్మానం



**నవతరం-శ్రీకాకుళం**

శ్రీకాకుళం జిల్లా ఇప్పిలి గ్రామానికి చెందిన ఇప్పిలి సీతయ -నరసమ్మ దంపతుల రెండవ కుమారుడు ఇప్పిలి జీవేశ్వరరావు గారు, సీఆర్‌పీఎఫ్‌లో కానిస్టేబుల్‌గా సేవలు ప్రారంభించి సబ్ ఇన్‌స్పెక్టర్ పదవికి పదోన్నతి పొందిన సందర్భంగా గ్రామ ప్రజలు ఘనంగా సన్మానించారు.

దేశ సరిహద్దుల్లో సుమారు 35 సంవత్సరాల పాటు సీఆర్‌పీఎఫ్ జవాన్‌గా దేశ సేవ చేయడం గర్వకారణమని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. ఆయన కృషి యువతకు ఆదర్శమని అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు కరణం శ్రీనివాసరావు, ఆదర్శ రైతు కరణం గోవిందరాజులు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ కరణం వెంకటరమణ, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు కరణం శ్రీరాములు, రిటైర్డ్ మాస్టారు లోలుగు శివరామకృష్ణ, ఇప్పిలి సన్యాసిరావు, డ్రాయింగ్ మాస్టర్ ఇప్పిలి గణేష్, బూరాడ సూర్య తదితరులు పాల్గొని జీవేశ్వరరావు గారిని శాలువాతో సత్కరించి అభినందించారు.

గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై దేశ సేవ చేసిన వీరజవాన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఆధునిక సాంకేతికతతోనే రైతులకు వెలుగులు

**నవతరం -శ్రీకాకుళం**

వ్యవసాయం రైతుల జీవనాడి అని, సాగులో ఆధునిక సాంకేతికతను జోడించినప్పుడే అన్నదాతలు ఆర్థికాభివృద్ధి సాధిస్తారని శ్రీకాకుళం జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆర్. వెంకటరమణ పేర్కొన్నారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఉత్తరకోస్తా మండల వ్యవసాయ పరిశోధన మరియు విస్తరణ సలహా మండలి రెండో రోజు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఆచార్య ఎన్.జీ. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకులు డాక్టర్ పి.వి. సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉత్తరకోస్తా జిల్లాల వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు. వరి, మొక్కజొన్న, చెరుకు, నూనెగింజలు, అపరాల సాగులో రాబోయే ఏడాది చేపట్టాల్సిన పరిశోధనలు, విస్తరణ కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చించి ఆమోదం తెలిపారు.

సాగు ఖర్చులు తగ్గించి దిగుబడి పెంచేలా జీవన ఎరువులు, జీవనియంత్రణ పద్ధతుల వినియోగంపై శాస్త్రవేత్తలు రైతులకు దిశానిర్దేశం చేశారు. పంటల సాగులో శాస్త్రీయ పద్ధతులు అనుసరించడం ద్వారా ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించి, నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని వివరించారు.

ముఖ్యంగా వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడింపు ద్వారా రైతులు గరిష్ట లాభాలు పొందే అవకాశాలపై సమావేశంలో చర్చించారు. పంటల ప్రాసెసింగ్, నిల్వ, మార్కెటింగ్ వ్యవస్థలను మెరుగుపరచడం ద్వారా రైతుల ఆదాయం పెంచవచ్చని సూచించారు.

ఈ కార్యక్రమంలో సంచాలకుల ప్రతినిధి డాక్టర్ ఎ.వి. రమణ, యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ పి. రాజా, శ్రీకాకుళం జిల్లా వ్యవసాయ అధికారి వై.వి. మురళీకృష్ణతో పాటు విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

# భార్య హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

**నవతరం -శ్రీకాకుళం**

భార్యను నాటు తుపాకితో కాల్చి హత్య చేసిన కేసులో నిందితుడికి గౌరవనీయ 6వ అదనపు జిల్లా న్యాయస్థానం జీవిత ఖైదు విధించినట్లు జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి ఐపీఎస్ గురువారం తెలిపారు.కేసు వివరాల ప్రకారం, ముద్దాయి సవర జగ్గారావు (45) తన భార్య సవర పద్మ (33) ప్రవర్తనపై అనుమానంతో 16-10-2021న సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గొడవకు దిగాడు. ముందుగా పన్నిన పథకం ప్రకారం వన్యమృగాల వేటకు ఉపయోగించే నాటు తుపాకితో భార్య ఛాతీపై సమీపం నుంచి కాల్పులు జరపడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. తుపాకీ శబ్దం విని ఇంటికి వచ్చిన కుమారుడు జగదేశ్ రక్తపు మడుగులో తల్లిని, చేతిలో తుపాకీతో ఉన్న తండ్రిని చూసి భయంతో బయటకు వెళ్లి బంధువులకు సమాచారం ఇచ్చాడు. అనంతరం మెలియాపుట్టి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఐపీసీ 302, 498-ఏ సెక్షన్లతో పాటు ఆయుధ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఈ కేసును సీఐ ఆర్. రవిప్రసాద్ దర్యాప్తు చేసి పక్కా సాక్ష్యాలు సేకరించి నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. ప్రాసిక్యూషన్ తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ దువ్వ జగన్నాయకులు వాదనలు వినిపించారు. విచారణ అనంతరం నిందితుడిపై నేరం రుజువుకావడంతో 6వ అదనపు జిల్లా జడ్జి కోడూరు కిశోర్ బాబు తీర్పు వెలువరించారు.నిందితుడికి ఐపీసీ 302 కింద జీవిత ఖైదుతో పాటు రూ.1,000 జరిమానా, ఆయుధ చట్టం సెక్షన్లు 25, 27 కింద 7 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.1,000 జరిమానా విధించారు.ఈ కేసులో సమర్థవంతంగా దర్యాప్తు చేసి నిందితుడికి శిక్ష పడేలా చేసిన దర్యాప్తు అధికారి, పబ్లిక్ ప్రాసిక్యూటర్, పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

# పలాసలో మిన్నంటిన టీడీపీ సంబరాలు

**నవతరం -పలాస**

తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేష్ బాధ్యతలు స్వీకరించిన శుభసందర్భాన్ని పురస్కరించుకుని, పలాస మండల టీడీపీ నాయకులు ఘనంగా వేడుకలు నిర్వహించారు.

లోకేష్ నాయకత్వం పార్టీకి మరింత ఊపునిస్తుందని ఆకాంక్షిస్తూ, మండల కేంద్రంలో నాయకులంతా కలిసి భారీ కేక్‌ను కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పార్టీ రాష్ట్ర కమిటీలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకు సముచిత స్థానం కల్పించడం పట్ల పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు.

పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించడం పట్ల నియోజకవర్గ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.

పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తున్న కింజరాపు కుటుంబానికి తగిన గౌరవం మరియు బాధ్యతలు అప్పగించడం పట్ల కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు.

విజయకేతనం దిశగా అడుగులు

రాష్ట్ర కమిటీలో పలాస నియోజకవర్గానికి మరియు జిల్లా నేతలకు లభించిన ప్రాధాన్యతతో రాబోయే రోజుల్లో పార్టీ మరింత బలోపేతం అవుతుందని నాయకులు ధీమా వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో పి. విఠల్ , వి కుర్మా రావు, డి సంతోష్,టి గంగారాం ,యాదగిరి, కుత్తుం ప్రకాష్,బి.రాజు, నాయుడు , మండల స్థాయి ముఖ్య నేతలు, పార్టీ కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని సందడి చేశారు.

# మహా మనిషి

**(ఏప్రిల్ 16-చార్లీ చాప్లిన్ జయంతి)**

సినిమా చాలా మందికి వ్యాపారం కావచ్చు. కానీ కొంతమందికి సినిమా ఓ జీవితం. ఓ కళ.వ్యాపారంగా భావించినవారు కొంతమంది సినిమాల ద్వారా కొట్లు సంపాదించి ఉండవచ్చు. కానీ కళగా భావించిన చాప్లిన్ వంటి వారు సినిమా ద్వారా మానవాళికి గొప్ప సందేశాన్ని ఇచ్చారు. మంచి వినోదాన్ని పంచారు.

చార్లీబిచాప్లిన్ 1889 ఏప్రిల్ 16నఇంగ్లండ్?లోజన్మించారు.అతని తల్లి పేరు హన్నా ఆమె శ్పానిష్-ఐరిష్ వంశంనుండి వచ్చింది. తండ్రి చార్లెస్ ఫ్రెంచి-యూదు వంశీయుడు.

తల్లిదండ్రులిరువురు వృత్తిరీత్యా నటులు వారి ప్రదర్శనలు 'వాడెవిల్' అనే తరహాకి చెందినవి. అంటే ఆట, పాట, హాస్యంతో కూడిన చౌచౌ ప్రదర్శనలన్నమాట. ఇంగ్లండ్?లో మ్యూజిక్ హాల్స్?గా ప్రసిద్ధికెక్కిన నాటక మందిరాలలో ఈ వాడెవిల్ ప్రదర్శనలు జరిగేవి.

చాప్లిన్ తల్లిదండ్రులు ఈ ప్రదర్శన లిచ్చి డబ్బు గడించేవారు. కాని, అలా గడించిన డబ్బంతా తండ్రి తాగేసేవాడు. అందువల్ల చాప్లిన్ బాల్యమంతా కటిక పేదరికంలోనే గడిచింది. తండ్రి కొన్నాళ్లకి కుటుంబాన్ని విడిచిపెట్టి వెళ్ళిపోయాడు. మరికొన్నాళ్లకి చనిపోయాడు. తల్లి అష్టకష్టాలు పడి పిల్లలను పెంచింది. కొన్నాళ్లకి ఆమెకి మతి చలించి, ఉన్మాదిని అయింది. ఆమెను మానసిక చికిత్సాలయంలో చేర్పించారు.

పువ్వు పుట్టగానే పరిమళించినట్లు చాప్లిన్ మూడేళ్ల వయస్సులోనే మిమిక్రీలో తన ప్రావీణ్యం కనబరచారు. అయిదవ ఏట మొదటిసారిగా తన తల్లి బదులుగా స్టేజి మీదకి ఎక్కి పాట పాడారు. క్రమంగా నట వృత్తిలో ప్రవేశించారు. కాని వేషాలు వరసగా దొరికేవి కావు. పది పదకొండేళ్ల వయస్సు వచ్చేవరకు అతని జీవితం చాల దుర్భరంగా గడిచింది. కూలి నాలి చేసి పొట్టపోసుకునేవారు. మార్కెట్?లోనో, పార్కులలోనో పడుకునేవారు. కాని క్రమంగా వేషాలు వేసే అవకాశాలు వచ్చాయి. అందులో షెర్లాక్ హెమ్స్ నాటకంలో బిల్లీ అనే ఆ ఫీసు బోయ్ వేషం ఒకటి . 1904 నాటికి మంచి నటుడుగా పేరు వచ్చింది. మంచి భవిష్యత్తువుందని అందరు అనేవారు. అన్న సిడ్నీ ద్వారా కార్నో కంపెనీ అనే సంస్థలో నటుడుగా చేరారు. 1910-1913 మధ్యకాలంలో ఆ కంపెనీతో పాటు అమెరికా వెళ్ళి ప్రదర్శనలిస్తూ పర్యటించారు. అక్కడా అతనికి మంచి పేరు వచ్చింది. అతని అభిమానులలో ఒకడు మాక్ సెనెట్. అతను కీస్టోన్ అనే స్టూడియోకు అధిపతి, నటుడు, చలన చిత్ర నిర్మాత. అప్పటికే అతడుఎన్నో కామెడీలు నిర్మించారు. అప్పటికి స్టేజిమీద వారానికి 50 డాలర్ల జీతంపుచ్చుకుంటున్న చాప్లిన్?ను వారానికి 150 డాలర్లతో తన సినిమాలలోకి తీసుకున్నారు. 1914 సంవత్సరమంతా చాప్లిన్ కీస్టోన్ చిత్రాలలో నటించారు.

అతడు తీసిన వివిధ చిత్రాలలో కొన్ని వందల హాస్య సన్నివేశాలను, హాస్య హావభావాలను, ముఖ కవళికలను, భంగిమలను సృష్టించారు. వీటిని ఆ తర్వాత కాలంలో చాలా మంది కాపీ కొట్టారు. అతని వేషధారణను కూడా కొందరు అనుకరించారు. ఆ రోజులలో దాదాపుగా ప్రతి దేశపు సినిమా రంగంలోను ఒక చార్లీ వుండేవారు. మన హిందీ సినిమాలలో కూడా ఒక చార్లీ వుండేవారు.


అయితే చాప్లిన్ నటన కేవలం పాంటోమైమ్‌తో ఆగిపోలేదు . దానికి మానవతా వాదమనే కొత్త డైమెన్షన్‌ను కల్పించారు. ఒక అర్ధశతాబ్దానికిపైగా అతడు దేశదేశాల వారిని వయోభేదం, మత, వర్గభేదం లేకుండా నవ్వించారు. బాధామయమైన జగత్తులో హాస్య జ్యోతిని వెలిగించారు. ప్రపంచంలోని వెకిలితనాన్ని, మురికితనాన్ని, కరుకుతనాన్ని, ఇరుకుతనాన్ని తన చిత్రాలలో చూపించడం ద్వారా వాటిని పారద్రోలడానికి ప్రయత్నించారు. అయన నటించిన చిత్రాలలో అనేకం మంచి హాస్యాన్ని పంచాయి.మానవుడి పేరాసను, దురాశను వ్యంగ్యంగా చిత్రించిన " గోల్డ్ రష్ " (1925) ను పలువురు విమర్శకులు చాప్లిన్ ఉత్తమోత్తమ చిత్రంగా పేర్కొంటారు. చాప్లిన్ కూడా అలాగే భావించాడని అంటారు. ఆ చిత్రంలో మానవుడిని ఆకలి ఎలా మార్చివేస్తుందో చాప్లిన్ అద్భుతంగా చూపించారు.

చాప్లిన్ 1952లో నిర్మించిన లైమ్?లైట్ అతని చలన చిత్ర జీవితానికిమకుటాయమానమైనది. ఒకప్పుడు మ్యూజిక్ హాల్ కమెడియన్?గా ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించి గొప్ప విజయం సాధించిన ఒక క్లౌన్ రానురాను నవ్వించే శక్తిని కోల్పోయి విస్మృతి గర్భంలో పడిపోయి నిరాశకు లోనవుతాడు. అదే సమయంలో తన కంటే ఎక్కువగా నిరాశకు లోనై ఆత్మహత్యచేసుకోబోయిన ఒక వ్యక్తిని రక్షించి ఆమెకు జీవితం పట్ల కొత్త ఆశను చిగురింపచేస్తారు. తన పాత్రల ద్వారానే గాకుండా, తన వ్యక్తిత్వం ద్వారా మహా మనిషిగా పేరు పొందారు చాప్లిన్.



యం.రాం ప్రదీప్

# నీలాంబరి ఒక ప్రేమ కథ



హైదరాబాద్ నగరంలో రాత్రి వెలుగులు
మెరిసిపోతున్నాయి.
అయితే ఆ వెలుగుల మధ్యలో కూడా
ఆదిత్య మనసులో మాత్రం ఒక
విచిత్రమైన ఖాళీ.

అతను చాలా మందిని చూసాడు...
చాలా పరిచయాలు అయ్యాయి...
కానీ అతని మనసును ఒక్కరే తాకింది
నీలాంబరి.

ఆమె గురించి ఆలోచిస్తే అతనికి
ఎప్పుడూ ఒక ప్రశ్నే వచ్చేది
"బాధ లేకుండా జీవితం ఉంటుందా?
ఆరాటం లేకుండా ప్రేమ ఉంటుందా?"

నీలాంబరి అతని జీవితంలోకి ఎలా
వచ్చిందో కూడా అతనికి స్పష్టంగా గుర్తు
లేదు.
ఒక రోజు వర్షం పడుతున్నప్పుడు... ఒక
కాఫీ షాప్‌లో ఆమెను చూసాడు.
ఆ చూపే చాలు... అప్పుడే ఏదో
మారిపోయింది.

ఆమె నవ్వు ప్రశాంతంగా ఉంటుంది...
కానీ ఆ చూపుల్లో మాత్రం ఒక తుఫాను
దాగి ఉంటుంది.

ఆదిత్యకి ఆమె ఏమిటో అర్థం కాలేదు
ఆమె ఒక మేఘమా?
లేదా ఒక తుఫానా?
లేదా తన జీవితాన్ని మార్చే ఒక
నియమమా?

ఏమైతేనేం...
ఆమె కోసం తాను ఏమైనా
భరించగలనని మాత్రం
అతనికి స్పష్టంగా తెలుసు.

ఆమె ఒక్క చూపు చాలు...
అతని లోపల ఎన్నో కలలు
కల్లోలం అవుతాయి.
అయినా... అతను ఆ తుఫాన్నే
ఇష్టపడ్డాడు.

ఒకసారి ఆమె అడిగింది
"నేను ఒక వరదలా వస్తే...
నువ్వు నిలబడగలవా?"

అతను నవ్వుతూ చెప్పాడు
"నువ్వు వరదైతే... నేను
వారధిలా మారతా
కానీ నీ కోసం మాత్రం
ఎప్పటికీ ఎదురుచూస్తూనే ఉంటా."

ఆమె దగ్గరగా ఉంటే అతనికి సమయం
ఆగిపోయినట్టుగా అనిపిస్తుంది.
ఆమె శ్వాసలో, ఆమె మాటల్లో, ఆమె
నిశ్శబ్దంలో...
అతను తనని తాను కోల్పోతున్నాడని
తెలుసు.

కానీ అతనికి అది భయం కాదు...
అది అతని ఆనందం.

ఒక రాత్రి... చంద్రుడు ఆకాశంలో
నెమ్మదిగా వెలుగుతున్నప్పుడు
ఆదిత్య ఆమెను చూస్తూ చెప్పాడు

"నీ కన్నులు నన్నే చూస్తూ ఉంటే
చాలు...
నేను జీవితాంతం నిన్నే చూస్తూ
ఉండిపోతా."

నీలాంబరి ఏమీ మాట్లాడలేదు...
కానీ ఆమె కళ్లలో వచ్చిన కాంతి
అతని ప్రశ్నలకు సమాధానం అయింది.

ముగింపు :
ఇది ఒక పూర్తి ప్రేమకథ కాదు...
ఇది ఇంకా కొనసాగుతున్న ఒక
అనుభూతి.

నీలాంబరి...
ఆమె ఒక అమ్మాయి కాదు
ఒక మనసు లోతుల్లో నిలిచిపోయే
అనుభూతి.

రాసినోడు : తేరాల. రాజేంద్ర ప్రసాద్ గుప్తా - హైదరాబాద్ - 9297109223

# రిమ్స్ నర్సింగ్ కళాశాలలో రోజారాణికి ఘన నివాళి

- అకాల మరణంపై సంతాప సభ నిర్వహణ
- నర్సింగ్ రంగానికి విశేష సేవలందించారని స్మరణ
- ఫ్యాకల్టీ, సిబ్బంది పాల్గొని నివాళులు

**నవతరం-శ్రీకాకుళం**



రిమ్స్ ఆవరణలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో హైదరాబాద్ గాంధీ ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ప్రొఫెసర్‌గా సేవలందించిన రోజారాణి గారి అకాల మరణం పట్ల సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. ఝాన్సీ లక్ష్మీబాయి గారు ఆమె సేవలను స్మరించుకుంటూ ఘన నివాళులు అర్పించారు. రోజారాణి గారు గాంధీ నర్సింగ్ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్‌గా సేవలందించడమే కాకుండా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నర్సెస్ అండ్ మిడ్‌వైవ్స్ కౌన్సిల్ రిజిస్ట్రార్‌గా విశేష సేవలు అందించి ప్రశంసలు అందుకున్నారని తెలిపారు.అదేవిధంగా ఎస్ఎఫ్ఐలో మహిళా నాయకురాలిగా సుమారు 30 సంవత్సరాల పాటు సేవలందించి, నర్సింగ్ రంగంలో తనదైన ముద్ర వేశారని పేర్కొన్నారు. ఆమె మరణంతో నర్సింగ్ రంగం ఒక ధృవతారను కోల్పోయిందని, ఆమె లోటు ఎవరూ భర్తీ చేయలేరని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. ఝాన్సీ లక్ష్మీబాయి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు శ్రీమతి ఎం. మీచల్, శ్రీమతి డి. ఉషా పన్నగవేణి, లెక్చరర్లు శ్రీమతి కె. పద్మావతి, ఎ.ఎస్.ఎస్. హరిప్రియా, శ్రీమతి స్వర్ణ, శ్రీమతి ప్రమీలతో పాటు నర్సింగ్ ఫ్యాకల్టీ, కార్యాలయ సిబ్బంది పాల్గొని నివాళులు అర్పించారు.

# రీ-సర్వే సమస్యల పరిష్కారమే ధ్యేయం

**నవతరం -జలుమూరు**


రీ-సర్వే అనంతరం ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను అధిగమించి రైతులకు తప్పులు లేని పట్టాదారు పాసు పుస్తకాలను అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. గురువారం ఆయన జలుమూరు మండలం అక్కురాడ పంచాయతీ పరిధిలో పర్యటించి రీ-సర్వే పురోగతి, రికార్డుల నమోదుపై క్షేత్రస్థాయిలో సమీక్ష నిర్వహించారు. అక్కురాడ పంచాయతీ పరిధిలోని ఐదు రెవెన్యూ గ్రామాల్లో మొత్తం 924 ఖాతాలు ఉండగా, ఇప్పటివరకు 45 ఖాతాలను మాత్రమే సరిచేసినట్లు కలెక్టర్ దృష్టికి వచ్చింది. మిగిలిన ఖాతాల్లో దొర్లిన పొరపాట్లను సరిదిద్దడంలో జాప్యం జరుగుతోందని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్, సర్వే లోపాలను సవరించేందుకు మండల స్థాయి అధికారులు, సర్వేయర్లు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రతి రైతుకూ పారదర్శకంగా, ఎటువంటి అక్షర దోషాలు లేని పాసు పుస్తకాలు అందించే బాధ్యత రెవెన్యూ యంత్రాంగంపైనే ఉందన్నారు.

సాంకేతిక కారణాల వల్ల కొన్ని ఖాతాల్లో మార్పులు అవసరమయ్యాయని, వాటిని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి సమస్యనూ పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. పెండింగ్‌లో ఉన్న ఖాతాలను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన వారందరికీ సత్వరమే పాసు పుస్తకాలు అందేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు.

పర్యటనలో తహసీల్దార్ జెన్ని రామారావు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో రొట్టవలస హైస్కూల్ ప్లస్ హవా

- విద్యార్థినుల ప్రతిభతో రికార్డు ఫలితాలు
- ఎంపీసీ, బైపీసీలో ఉత్తమ మార్కులు సాధన
- మెరిట్ సాధించిన వారికి నగదు బహుమతులు



**నవతరం-శ్రీకాకుళం**

నిన్న విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో రొట్టవలస హైస్కూల్ ప్లస్ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు రికార్డు స్థాయి ఫలితాలు సాధించి ప్రతిభ చాటారు. ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో ఉత్తమ మార్కులు సాధించి కళాశాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు.ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో సతివాడ మౌనిక 470 మార్కులకు గాను 459 మార్కులు సాధించి ప్రథమ స్థానం దక్కించుకుంది. పైడి ఝాన్సీ 450 మార్కులతో ద్వితీయ స్థానం, ముక్కాల పూజిత 445 మార్కులతో తృతీయ స్థానం సాధించారు.ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో చిట్టి పల్లవి 898/1000, పైడి మణి 864/1000, గళాల శ్రావ్య 834/1000 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో నడిమింటి గీత 911/1000, మూడెడ్ల శరణ్య 800/1000, బిందు 761/1000 మార్కులతో మెరిశారు.కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో 67 శాతం, బైపీసీలో 75 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 60 శాతం, బైపీసీలో 50 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు యాజమాన్యం తెలిపింది.ఈ సందర్భంగా హైస్కూల్ ప్లస్ ప్రధానోపాధ్యాయులు కత్తిరి రామకృష్ణ కేక్ కట్ చేసి విద్యార్థినులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ప్రతినిధి మూడెడ్ల రమణ, ఎస్ఎంసీ చైర్మన్ బెవర రాజేశ్వరి, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రసాయన శాస్త్రంలో ప్రథమ సంవత్సరంలో 85/85 మార్కులు సాధించిన సతివాడ మౌనిక, పైడి ఝాన్సీ, ముక్కాల పూజిత, పిన్నింటి కావ్య, గజ్జన ఉషతో పాటు ద్వితీయ సంవత్సరంలో 60/60 మార్కులు సాధించిన నడిమింటి గీత, ఎస్. లక్ష్మి, రాయి చాందినిలకు ఒక్కొక్కరికి రూ.1,116 చొప్పున నగదు బహుమతులను రసాయన శాస్త్ర అధ్యాపకులు బోనెల రమేష్ పెద్దల చేతుల మీదుగా అందజేశారు.

# ఉమాకవికి రవీంద్ర భారతిలో కందుకూరి పురస్కారం

మొదటి పేజీ తరువాయి

బడేసాహెబ్, సర్వేజనా ఫౌండేషన్ చైర్మన్ ఏవి గురువారెడ్డి,ముఖ్య అతిథి కొలకనూరి ఇనాక్, సినీ దర్శకులు దైవజ్ఞశర్మ, గంటామనోహర్ రెడ్డి,కుసుమ ధర్మాన పీఠం చెర్మన్ రాధా కుసుమ,, దూరదర్శన్ టీవీ రీడర్, ఏంకర్ విజయదుర్గ,విశ్రాంతఇస్రోశాస్త్ర వేత్త డబ్బీరు శరత్ కవి, గాడేపల్లి మల్లికార్జున్,రామకృష్ణ చంద్రమౌళి,తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారి చికిత్సకు రూ.10 వేల ఆర్థిక సాయం

**(నవతరం టెక్కలి)**

శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలంలోని టెక్కలి గ్రామానికి చెందిన చిన్నారి దీక్షిత వెన్నుపూస సమస్యతో బాధపడుతోంది. చిన్నారికి తండ్రి లేకపోవడంతో తల్లి ఆశావర్కర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. చిన్నారి చికిత్సకు సుమారు రూ.8 లక్షలు ఖర్చు అవుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు.పేదరికంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న సిక్కోలు ఉద్దానం సేవా సమితి సభ్యులు వెంటనే స్పందించి గురువారం చిన్నారి చికిత్స నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు పృధ్వి, సాయి, సాయితేజ పాల్గొన్నారు. చిన్నారి ఆరోగ్యం కోసం ఇతర స్వచ్ఛంద సేవా సంస్థలు, దాతలు కూడా తమ వంతు సహాయం అందించాలని సేవా సమితి సభ్యులు కోరారు.

# ఆదిత్య కాలేజ్‌కు ఘన ఫలితాలు




- ఎంపీసీలో జిల్లా ఫస్ట్
- బైపీసీలో ప్రతిభా ర్యాంకులు
- 970కి పైగా మార్కులతో 18 మంది
- యాజమాన్యం హర్షం

**నవతరం-శ్రీకాకుళం**

ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో శ్రీకాకుళంలోని శ్రీ ఆదిత్య జూనియర్ కాలేజ్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో విశిష్ట ఫలితాలు సాధించి కళాశాలకు పేరు తెచ్చారు.ఎంపీసీ విభాగంలో మీనాల లహరి 470 మార్కులకు గాను 466 మార్కులు సాధించి జిల్లా ఫస్ట్‌గా నిలిచింది. 460కి పైగా మార్కులు 21 మంది, 450కి పైగా మార్కులు 48 మంది సాధించారు.

బైపీసీ విభాగంలో గురువు కీర్తిక 455లో 439 మార్కులు సాధించింది. 435కి పైగా మార్కులు 8 మంది సాధించారు.కానడ గాయత్రి లక్ష్మి 984 మార్కులు, ఎద్దె దివిత 982 మార్కులు సాధించి మెరిశారు. 970కి పైగా మార్కులు మొత్తం 18 మంది సాధించినట్లు యాజమాన్యం తెలిపింది.

సీఈఓ పి. రామారావు, డైరెక్టర్ బి.ఎస్. చక్రవర్తి, ప్రిన్సిపాల్ ఎం. దిల్లీశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ పి. అసిరి నాయుడు విద్యార్థులను అభినందించారు.

# బెలిపడ కాలనీలో అగ్నిమాపక అవగాహన




**నవతరం-ఇచ్ఛాపురం**

- ఫైర్ సర్వీస్ వీక్‌లో భాగంగా కార్యక్రమం
- గ్యాస్, షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలపై సూచనలు
- ప్రజల్లో భద్రతా చైతన్యం కల్పించిన సిబ్బంది

ఫైర్ సర్వీస్ వీక్ సందర్భంగా మూడో రోజు ఇచ్ఛాపురం అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో బెలిపడ కాలనీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్పీజీ గ్యాస్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగే ప్రమాదాలు, వాటిని నివారించే మార్గాలపై సిబ్బంది ప్రజలకు వివరించారు.అలాగే అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన తక్షణ చర్యలను ప్రదర్శన ద్వారా చూపించి ప్రజల్లో చైతన్యం కల్పించారు. పలు ప్రాంతాల్లో పోస్టర్లు అతికించి భద్రతపై అవగాహన పెంపొందించారు.ఈ కార్యక్రమంలో ఇచ్ఛాపురం ఫైర్ స్టేషన్ ఇంచార్జి ఎస్ఎఫ్‌వో కాశినాథ్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ పాద వల్లభా.! సి పి ఎస్ రద్దు చేయు..రా.!

## ఎన్ ఓ పి ఆర్ యూ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మాచన రఘునందన్



భాగస్వామ్య పింఛను పథకం (సి పి ఎస్)రద్దు అనే విషయం దైవాధీనం అయ్యిందని,అందుకే ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేస్తున్నట్టు నేషనల్ ఓల్డ్ పెన్షన్ రెస్టొరేషన్ యునైటెడ్ ఫ్రంట్ (ఎన్ ఓ పి ఆర్ యూ ఎఫ్) తెలంగాణ అధ్యక్షులు మాచన రఘునందన్ అన్నారు. గురువారం నాడు ఆయన భాగస్వామ్య పింఛను పథకం(సి పి ఎస్)రద్దు కావాలన్న తమ అభిమతం నెరవేరాలని కోరుతూ..పసుపుల పశీచదేవ్ పహాడ్ లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునందన్ మాట్లాడుతూ..పాలకులు ఎప్పటికప్పుడు సి పి ఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చి పబ్బం గడుపుకుంటున్నారే తప్ప..పెన్షన్ తో ఉద్యోగుల ఆర్థిక భద్రత అన్న విషయం వారికి పట్టడం లేదని రఘునందన్ అవేదన వ్యక్తం చేశారు.దేశ వ్యాప్తంగా కోటి మంది కి పైగా ఉద్యోగులు న్యూ పెన్షన్ స్కీమ్ వద్దు అని దైవాన్ని దీనంగా అర్థిస్తున్నామని రఘునందన్ వివరించారు. పాలకులకు సి పి ఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ పథకం ను పునరుద్దరించేలా బుద్ధి ప్రసాదించాలని కోరుతూ..దేవుళ్ళకు, దేవతలకు పూజలు చేస్తున్నామని రఘునందన్ వెల్లడించారు. రఘునందన్ వెంట శ్రీనాథ్ తదితరులు ఉన్నారు.

# తెలంగాణ రాష్ట్రం- కామారెడ్డి జిల్లాలో.... త్రిలింగరామేశ్వర దేవాలయం





తెలంగాణ రాష్ట్రం కామారెడ్డి జిల్లా, నాగిరెడ్డిపేట మండలం,తాండూరు గ్రామంలో రామేశ్వర దేవాలయం ఉన్నది.రామేశ్వర, భీమేశ్వర,సోమేశ్వర అనే మూడు లింగాల కలయికతో ఒకే చోట లింగాకృతిలో ఉన్న ఈ దేవాలయం సా. శ. 12 వ శతాబ్దంలో నిర్మించబడి, శివుడికి అంకితం చేయబడిన ఆలయం. రాముడు ఈ శివలింగాన్ని స్థాపించాడని, శివుడిని భీమేశ్వర స్వామి అని పిలుస్తారు.ఈ ఆలయ రహదారిలో ప్రయాణించేటప్పుడు ఈ ప్రాంతం చుట్టూ పచ్చని చెట్ల వరి పొలాలు ఆనందపరుస్తాయి. అలాగే నీటితో నిండిన సరస్సులను చూడవచ్చు.దేవాలయం చుట్టూ ఆడుతున్న తెల్ల ఆవులతో పాటు మరికొన్ని పశువులను అక్కడ చూడడం ముచ్చటగా ఉంటుంది. ఇది గ్రామ వాతావరణం యొక్క అనుభూతిని ఇస్తుంది.

ఈ ఆలయం తెలుపు రంగులో ఉంది మరియు ఆలయం ముందు మండప యొక్క మరొక పాత నిర్మాణం ఉన్నది. ఇది దాని సొంత నిర్మాణ ప్రాముఖ్యతను కలిగి ఉన్నది. ఈ ఆలయం చాలా సాధారణమైనదిగా కనిపిస్తుంది. ఈ ఆలయం యొక్క చరిత్ర అద్భుతమైనది ఈ ప్రదేశం గురించి తెలుసుకోవడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఆలయం పై భాగంలో ఆలయం త్రిలింగ రామేశ్వర ఆలయం తాండూర్, కామారెడ్డి అని గోడపై నారింజ రంగులో రాశారు.

ఆలయ ప్రవేశ ద్వారం గోడపై ఉన్న మూడు ఆలయ గోపురాల్ని, ఆలయం పేరు కూడా నారింజరంగులో వ్రాయబడి ఉంది. ప్రవేశద్వారం వద్ద కాకతీయ కాలానికి చెందిన ఇద్దరు ఆడవారి విగ్రహాలు ఉన్నాయి అంతే కాకుండా ఆకుపచ్చ రంగులో ఉన్న డిజైన్లు రమణీయంగా ఉంటాయి.

ఈ ఆలయం రాత్రో మాత్రమే నిర్మించబడింది. ఆలయ నిర్మాణానికి సిమెంట్ లేదా మట్టిని ఉపయోగించలేదు. చాళుక్యులు ఈ ఆలయాన్ని నిర్మించారని కాకతీయులు ఈ ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేశారని చెబుతారు. ఏ వైపు నుండి చూసిన ఈ ఆలయం శివలింగంలా కనిపిస్తుంది. ఈ ఆలయ నిర్మాణ సౌందర్యాన్ని చూసినప్పుడు ఈ ఆలయం 11వ శతాబ్దికి చెందిందని భావిస్తారు.

త్రిలింగాలను రామ, భీముడు అని పిలుస్తారు. మరియు సోమను ఇక్కడ రామలక్ష్మణ మరియు సీత స్థాపించారు. ఈ ఆలయం ముందు నంది విగ్రహం ఉన్నది ఈ నందిపై ఉన్న నిర్మాణం అసాధారణమైనది. మనం నందిని తాకినప్పుడు నంది మనకు నిజమైన నందిని తాకిన అనుభూతిని ఇస్తుంది. ఉదయం ఈ శివలింగంపై సూర్యరష్మి నేరుగా వస్తుంది ఈ ఆలయానికి ఎదురుగా వీరన్న గుట్ట అనే కొండ ఉన్నది. ఈ ఆలయం నుండి ఆ కొండకు చేరుకోవడానికి ఒక మార్గం ఉందని స్థానికులు చెబుతున్నారు. ఈ మధ్య ఒక శివలింగం నాశనం అయ్యింది కానీ తరువాత కాశీ నుండి మరో శివలింగం దాని ప్రదేశంలో ఏర్పాటు చేశారు. ఈ ఆలయానికి ఎదురుగా ప్రవహించే మంజీరా నది ఉంది ఇది పైనుండి గమనించినప్పుడు శివలింగంలా కనిపిస్తుంది ఆలయంలోపల నల్ల రాతితో చేసిన శివ,పార్వతి విగ్రహాన్ని దర్శించుకోవచ్చు. ఈ ఆలయంలో ప్రదర్శించే ప్రత్యేక పూజలు లక్ష బిల్వార్చన, పౌర్ణమి రోజులలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 1978 లో ఈ ఆలయం పునర్నిర్మించబడింది. ఆ తర్వాత చాలా మార్పులు చేయబడ్డాయి.

### ఆలయ పూర్వ చరిత్ర:

వనవాసం చేసిన సమయంలో ఇక్కడ కొద్దికాలం గడిపిన శ్రీరాముడు, సీత, లక్ష్మణుడు ప్రస్తుతం మంజీరా నది ఉన్న ప్రాంతానికి వచ్చి స్నానం చేసి, తమోగుణం ప్రభావం వల్ల వారు తమకు నచ్చిన విధంగా ముగ్గురు వేర్వేరుగా కూర్చొని స్వతహాగా లింగాలను తయారు చేసుకొని పూజలు చేశారు. వాళ్ళు పూజలు ముగించడంతోనే ఈ ప్రాంతంలో మూడు లింగాల ఆలయాన్ని నిర్మించారని, రాముడు స్నానం చేసిన ప్రాంతాన్ని రామపాదాలు అని, రాముడు తీర్థం సేవించిన ప్రాంతాన్ని రామతీర్థంగా అని పిలుస్తున్నారని ఇక్కడి గ్రామస్తుల కథనం.

### ఆలయ నిర్మాణం:

ఒకే ఆలయంలో మూడు లింగాలు ప్రతిష్ఠితమై ఉండడం ఈ ఆలయ ప్రత్యేకత. లింగాకారంలో కనిపించే ఈ ఆలయంలో ఒకే రాతితో నిర్మించిన ముఖద్వారం, ప్రధాన ద్వారం, స్వాగత తోరణాలు ఉన్నాయి. నాలుగు ముఖద్వారాల్లో ప్రతి ముఖద్వారానికి ఒకే రాతితో నిర్మించిన శిల్పకళ ఉంది. నాట్యంతో స్వాగతం పలుకుతున్నట్టుగా ద్వారాలకు రెండు ప్రక్కల శిల్పాలు చెక్కబడ్డాయి.

### ఈ ఆలయాన్ని చేరుకోవడానికి మార్గం:

తాండూర్ గ్రామం కామారెడ్డి పట్టణానికి 48 కిలోమీటర్ల దూరంలో ఉంది ఇది నాగిరెడ్డిపేట మండలం నుండి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఆర్టీసీ బస్సు సౌకర్యం ఆటోలో సౌకర్యం ఉన్నది.



" కావ్యసుధ "
'వాఙ్మయ భూషణ'
" సాహితీ శిరోమణి "
" కవన సాగర "
'ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్'
" ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్ "
9247313488 :
హయత్ నగర్ :
హైదరాబాదు

# విమానయాన మార్గదర్శకుడు, ఆవిష్కర్త "విల్బర్ రైట్"

- టూరిజం నారాయణ రావు
- ఎయిర్ ట్రావెలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు



**నవతరం-శ్రీకాకుళం**

విమానయాన మార్గదర్శకుడు, ఆవిష్కర్త విల్బర్ రైట్ అని, టూరిజం నారాయణ రావు అన్నారు. రైటు సోదరులలో ఒకరైన విల్బర్ రైట్ జన్మదిన వేడుకలను, స్థానిక జిటి రోడ్, ఎయిర్ ట్రావెలర్స్ అసోసియేషన్ శ్రీకాకుళం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిధిగా పాల్గొని, విల్బర్ రైట్ చిత్రపటానికి పూల మాలలు వేసి అంజలి ఘటించి రైటు సోదరుల జీవిత విశేషాలపై ప్రసంగించారు. అనంతరం ఎయిర్ ట్రావెలర్స్ అసోసియేషన్ శ్రీకాకుళం అధ్యక్షులు లయన్ నటుకుల.మోహన్, లయన్ బాడన.దేవభూషణ్ మాట్లాడుతూ విల్బర్ రైట్, తన సోదరుడు ఓర్విల్లే రైట్‌తో కలిసి, 1903 డిసెంబర్ 17న ప్రపంచంలోనే మొదటి విజయవంతమైన శక్తితో నడిచే విమానాన్ని (రైట్ ఫ్లయర్) నిర్మించి ఎగరేశారని, వీరు సైకిల్ మెకానిక్‌లుగా జీవితాన్ని ప్రారంభించి, విమానయాన చరిత్రను మార్చారని గుర్తుచేశారు. ఈ రోజు మనమంతా గగన విహంగంలో ప్రయాణిస్తున్నామంటే దాని మూల కారకులు రైటు సోదరులన్నారు. విల్బర్, ఓర్విల్లే ఇద్దరూ జీవితాంతం బ్రహ్మచారులుగా ఉండి, విమాన పరిశోధనలకే తమ జీవితాన్ని అంకితం చేశారని, తమ సొంత సైకిల్ షాప్‌లో విమానం విడిభాగాలను తయారు చేసి, విజయవంతమైన విమానాన్ని రూపొందించారన్నారు. వ్యవస్థపై వీరు చేసిన పరిశోధనలే విమానయాన రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చాయని, కేంద్ర మంత్రి కింజరాపు.రామ్మోహన్ నాయుడు చొరవతో, భోగాపురం విమానాశ్రయం సిద్ధమైందని, అందుకు ప్రత్యేక ధన్యవాదాలన్నారు. అనంతరం ముఖ్య అతిధులకు దుస్సాలువాలతో ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో కాపవరపు. శీజూ, సదరన్ ట్రావెల్స్ ఉత్తమ్, ఎస్ఎస్ జ్యూయలర్స్ కె.శ్రీనివాస్, సాగర్ సిమెంట్, జిల్లా ఆదర్శ రైతు సంఘం అధ్యక్షులు కరణం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**